నేడు భూ భారతి చట్టంపై అవగాహన

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టం-2025పై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గురువారం ఖానాపూర్ రైతువేదికలో నిర్వహించనున్నట్లు గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలు పాల్గొంటారన్నారు. రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్వర్ గౌడ్

చందానగర్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల అపర్ణ జెనిత్ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దాతలు జనసంచారం ఉన్న ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, జావేద్, భరత్, రవి, నరేందర్ రెడ్డి, కిషోర్, శ్రవణ్, ప్రదీప్ పాల్గొన్నారు.

జోరుగా కూలర్ల విక్రయాలు

శాస్త్రిపురం: వేసవిలో భానుడి ప్రతాపం రోజురోజుకూ అధికం అవుతోంది. ఉదయం పది గంటలు దాటిందంటే వృద్ధులు, చిన్నారులు, మహిళలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఈ నేపథ్యంలో వేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ప్రత్యా మ్నాయ ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూలర్ల కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలోని ప్రధాన రహదారుల పక్కన కూలర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గడ్డితో తయారు చేసిన కూలర్లు పెద్ద మొత్తంలో అమ్ముడవుతున్నాయి. వ్యాపారులు బాలానగర్, జీడిమెట్ల ప్రాంతాల నుంచి కూలర్లను తీసువచ్చి విక్రయిస్తున్నారు. గడచిన వారం రోజులుగా వందలాది కూలర్లను విక్రయించామని వ్యాపారి మహ్మద్ అజీజ్ తెలిపారు. ఒక్కో కూలర్ ధర రూ. 3 వేల నుంచి రూ. 12 వేల వరకు ఉందని తెలిపారు.

అక్రమ పార్కింగ్.. పరేషాన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌ను ఆనుకొని ఇందిరానగర్ బస్తీకి వెళ్లే రోడ్డులో రోడ్డుకు రెండువైపులా అక్రమ పార్కింగ్‌లు స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. రెండు వైపులా అక్రమ పార్కింగ్‌లు వాహనాలను ముందుకు వెళ్లకుండా చేస్తున్నాయి. అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్‌లతో ఈ రోడ్డంతా ఇరుకుగా మారింది. స్థానికులు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. ఉదయం మొదలు అర్ధరాత్రి వరకు ఈ రోడ్డంతా వాహనాలతో నిండిపోతున్నది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌లను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యాచకుడు మృతి



చందానగర్: యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బుధవారం లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ నంబర్ ప్లాట్ ఫారం వైపు వృద్ధుడు (65) పడిపోయి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పరిశీలించిన పోలీసులు అతను మృతి చెందినట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

3.58 కిలోల గంజాయి, 3.5 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్ స్వాధీనం

చందానగర్: శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో గంజాయి, హెరాయిన్, బ్రౌన్ షుగర్ విక్రయిస్తున్న ముగ్గురిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా...శంషాబాద్ డీటీఎఫ్, ఎస్టీఎఫ్, మండల ఎక్సైజ్ పోలీసులు కలిసి వేర్వేరు చోట్ల గంజాయి విక్రయిస్తున్న వారిపై దాడి చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందని బాపి మియా (28) చందానగర్‌లో 1.2 కిలో గంజాయి, 3.5 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్, బొటానికల్ గార్డెన్ వద్ద నారాయణచౌదరి (56) 1.20 కిలోల గంజాయి, శేరిలింగంపల్లి జవహర్‌నగర్ వద్ద రాయల్ సునీల్ (22) 1.18 కిలోల గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3.58 కిలోల గంజాయి, 3.5 గ్రాముల హెరాయిన్, బ్రౌన్ షుగర్‌తో పాటు సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.







మియాపూర్‌లో నిరుపయోగంగా చేతిపంపులు

చేతిపంపులను బాగు చేయండి

● నీటి కష్టాలుండవు ● బస్తీవాసుల విజ్ఞప్తి



మియాపూర్: నిర్వహణ లేక.. నీరు రాక చేతి పంపులు నిరుపయోగంగా మారాయి. గతంలో బస్తీలు, కాలనీల నీటి అవసరాలను తీర్చిన బోరు పంపులు ప్రస్తుతం తుప్పుబట్టిపోయాయి. వాటిని బాగు చేయించేందుకు జలమండలి అధికారులు ముందుకు రావడం లేదు. ఎండాకాలం జలమండలి సరఫరా చేస్తున్న నీరు సరిపోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు బోర్లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకువస్తే నీటి కష్టాలు తప్పుతాయని బస్తీ ప్రజలు పేర్కొంటున్నారు.

◆ మియాపూర్‌లోని న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, ఆదిత్యనగర్, దీప్తిశ్రీనగర్, పీఎన్‌నగర్, ఎఫ్‌సీఐ కాలనీ తదితర కాలనీల్లో లక్షల రూపాయల నిధులు వెచ్చించి గతంలో చేతిపంపులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ చేతి పంపులు వృథాగా ఉన్నాయి.

◆ వేసవిలో బస్తీల్లో చేతి పంపు బోర్లపైనే ఎక్కువగా ఆధారపడేవారు. నగరంలో మంజీర నీటి సరఫరా ప్రారంభమైన నాటి నుండి బోర్ల వాడకం తగ్గిపోయింది. దీంతో వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఏ ప్రాంతంలో చూసినా చెడిపోయిన బోర్లు దర్శనమిస్తున్నాయి.

వాడుకలోకి తీసుకురావాలి..

ఒకప్పుడు బస్తీలకు నీటిని అందించిన చేతిపంపులు నేడు నిరుపయోగంగా మారాయి. తుప్పుబట్టి పోయాయి. ప్రస్తుతం ఎండకాలం కావడంతో జలమండలి నీరు సరిపోవడం లేదు. కాలనీ, బస్తీలలో ఉన్న చేతిపంపులను బాగు చేసి నీటి కష్టాలను తొలగించాలి.

– శివ ప్రసాద్‌రెడ్డి, ఎంఏనగర్ కాలనీ

◆ బస్తీ, కాలనీలలో నల్లాల ద్వారా రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న మంచినీరు సరిపోకపోవడంతో బస్తీ, కాలనీలవాసులు ఇబ్బందులుపడుతున్నారు. చేతిపంపు బోర్లు పనిచేస్తుంటే ఆ నీటిని తాము వాడుకునే వాళ్లమని అంటున్నారు.

◆ ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపులను వాడుకలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రూ.2 కోట్లతో ప్రాథమిక పాఠశాల భవనం



పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: నేడు ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన విద్యకు నిలయంగా మారాయని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలి ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణ పనులకు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నూతన భవనం నిర్మిస్తున్నట్టు చెప్పారు. తరగతి గదులు, క్లాస్ రూంలలో డ్యూయల్ డెస్కులు ,టాయిలెట్లు, మంచినీరు, భోజన శాల తదితర వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, నాయకులు గణేష్ ముదిరాజ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, లక్ష్మీ బాబు, స్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



గచ్చిబౌలి: ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో బుధవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను శేరిలింగంపల్లి సర్కిల్-20 టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. పోలీసు బందోబస్తు మధ్య గచ్చిబౌలి డాగ్ పార్క్, శ్రీరాంనగర్ కాలనీ ఏ, బీ బ్లాక్‌లతో ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. శ్రీరాంనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ జాం నెలకొనడంతో కాలనీవాసులతో పాటు వాహనదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. శ్రీరాంనగర్ కాలనీలో మాస్టర్ ప్లాన్ కంటె రోడ్డు తక్కువగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. దానికి తోడు ఫుట్‌పాత్ ఆక్రమణలు , అక్రమ పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు బందోబస్తుతో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్, సిటీ ప్లానర్ వెంకటరమణ, ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలను తొలగించారు.

భార్య, అత్తపై దాడి.. రిమాండ్

మియాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, అత్తపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ జనప్రియనగర్ రోడ్డు నంబర్ -5 శ్రీ వెంకట నిలయం అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న బందారులంక మహేష్ (30) భార్య శ్రీదేవితో గొడవపడుతుండగా అడ్డు వచ్చిన అత్త మంగపై కత్తితో దాడిచేసిన ఘటన తెలిసిందే. భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్యాయత్నానికి పాల్పడిన మహేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మియాపూర్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్ మదీనాగూడలోని మైత్రినగర్ కాలనీ ప్రధాన రహదారి పక్కన ఓ వృద్ధుడు (70) పడి ఉన్నాడని స్థానికులు మంగళవారం ఉదయం 10 గంటలకు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు.అతని గురించి చుట్టుపక్కల ఆరా తీయగా గత కొంతకాలంగా సమీపంలోని హోటళ్ల వద్ద భిక్షాటన చేస్తున్నాడని తెలిపారు. దీంతో పోలీసులు వృద్ధుడును చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

కాలనీల అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
● హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో రూ.12.50 కోట్లతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో .. శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్

చందానగర్: ప్రజా సంక్షేమం, కాలనీల అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో సుమారు రూ.4.22 కోట్లతో, మాదాపూర్ డివిజన్ పరిధిలో రూ.8.32 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్లు పూజితగౌడ్, జగదీశ్వర్ గౌడ్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుడా కాలనీలో రూ.1.47 కోట్లు, మదీనాగూడలో రూ.49 లక్షలు, మైత్రీనగర్ ఫేజ్ 3లో రూ.79.70 లక్షలు, సాయినగర్, యూత్ కాలనీలో రూ.86.60 లక్షలు, యూత్ కాలనీ, జామియా మసీదు నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వరకు, జనప్రియనగర్ ఫేజ్ 1 నుంచి ప్రజయ్ సిటి కాలనీ వరకు రూ.1.02 కోట్లతో సీసీ రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. అదే విధంగా మాదాపూర్ డివిజన్ పరిధిలో ఆదిత్యనగర్, కృష్ణనగర్, సైబర్ విలేజ్, వసంత సిటి, సంకల్ప్, మాధవనగర్, అయ్యప్ప సొసైటీ, ద్వారకనగర్, సాయినగర్, చంద్రనాయక్ తండా, కావూరి హిల్స్, సాయి సైబర్‌హిల్స్, యశోద హాస్పిటల్ నుంచి హెచ్‌పి పెట్రోల్‌పంప్, బుట్ట కన్వెన్షన్ నుంచి సీఎన్ తండా, సర్వే ఆఫ్ ఇండియా, గుట్టల బేగంపేట్ కాలనీలలో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఐదుగురిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ.1500 జరిమానా, ఒక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

పటాన్‌చెరు టౌన్: బచ్చుగూడెం గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేశారు. పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల ఎల్ -1 లిస్టులో ఉన్న ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత వికలాంగులకు, వితంతువులకు ఉంటుందని తెలిపారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

ఆల్విన్‌కాలనీ: జమ్ము కశ్మీర్‌లో అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నందుకు నిరసనగా బుధవారం టెర్రరిస్టుల దిష్టిబొమ్మను నిజాంపేట చౌరస్తాలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకులు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మతం కనుక్కొని కాల్చి చంపటం పిరికి పందల చర్య అని అన్నారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. సురభి రవీందర్‌రావు, రామరాజు, కేశవులు, మణిభూషణ్, నర్సింగ్‌యాదవ్, నాగులు గౌడ్, నరసింహాచారి, వీరాచారి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్ప అధికారులను కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ పనులను ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. నాయకులు నర్సింగ్ రావు, బాలయ్య, ముత్తన్న, వీరయ్య, నాగరాజులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు తమ నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా కాంట్రాక్ట్ పద్ధతిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15 ఏళ్లకు పైగా సేవలందించినా ఇంకా రెగ్యులర్ చేయకపోవటం తీవ్ర నిరాశకు గురి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యని పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో అన్ని బస్తీ, కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లాలి

మాదాపూర్‌లో బాక్స్ డ్రెయిన్ పనులు

గచ్చిబౌలి: బాక్స్ డ్రెయిన్ కాంక్రీట్ పనులు చేపడుతున్న కారణంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజారావు భూపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గఫూర్‌నగర్‌లోని నెక్టార్ గార్డెన్ జంక్షన్‌లో బాక్స్ డ్రెయిన్ పనులు జరుగుతున్న కారణంగా గురువారం సాయంత్రం 4 గంటల తరువాత సీఓడీ నుంచి ల్యాబ్స్, ఐటీసీ కోహినూర్ వైపు వచ్చే వాహనదారులు రోడ్ నెంబర్ 45, కేబుల్ బ్రిడ్జీ మీదుగా లేదా ప్రత్యామ్నాయ రోడ్లపై ప్రయాణించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఐకియా నుంచి సీఓడీ వైపు ప్రయాణించే వారు కేబుల్ బ్రిడ్జీ, రోడ్ నెంబర్ 45 మీదుగా వెళ్లాలన్నారు. సీ గేట్, డైరా, అవాసా హోటల్ వైపు నుంచి వెళ్లవచ్చన్నారు. ట్రాఫిక్ పోలీసులకు వాహనదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న ‘డిజైన్ సింక్’





కొల్హాపురి చెప్పులను తయారు చేస్తున్న కమల్ శెట్టి యాదిలాల్, తిలకిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: రాయదుర్గం ఎఫ్‌డీడీఐలో కొనసాగుతున్న ‘డిజైన్‌సింక్’ ప్రదర్శనలో భాగంగా మూడవరోజు బుధవారం కొల్హాపురి చెప్పుల తయారీని విద్యార్థులకు చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రశ్నలు అడిగారు. కొల్హాపురి చెప్పుల తయారీలో 45 ఏళ్ల అనుభవం ఉన్న జియాగూడ, ఇందిరానగర్ వాసి కమల్‌శెట్టి యాదిలాల్ మాట్లాడుతూ గంట సమయంలో చెప్పులు తయారు చేస్తానని తెలిపారు. రూ.180 నుంచి రూ.300 వరకు వాటి నాణ్యతను బట్టి ధర ఉంటుందన్నారు. అనంతరం పిడిలైట్ ఇండస్ట్రీస్ సీనియర్ మేనేజర్ రవీంద్రమోరే మాట్లాడుతూ డిజైన్ రూపకల్పనకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఏ రంగంలోనైనా నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పూర్తి చేస్తాం

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పెండింగ్‌లో ఉన్న బీటీ, సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ మెడికల్ సొసైటీ, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద బీటీ, సీసీ రోడ్డు పనులకు రూ.1.06 కోట్ల వ్యయంతో కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయిస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, ఆంజనేయులు, బాబు, మోహన్‌రావు, జగదీష్‌గౌడ్, శ్రీనివాస్, జై, అఖిల్, వివేకానందనగర్ కాలనీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, మెడికల్ సొసైటీ ప్రెసిడెంట్ జీపీ రెడ్డి, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ సెక్రటరీ సంతోష్‌రావు, భగవాన్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

రాయదుర్గం: జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడులకు నిరసనగా బుధవారం రాత్రి రాయదుర్గంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. పెద్ద సంఖ్యలో యువత, స్థానికులు పాల్గొన్నారు.



సమస్యలను సత్వరం పరిష్కరించండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ భూములకు సంబంధించి నెలకొన్న వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని భెల్ యాజమాన్యంను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం భెల్ ఈడి కే.బి.రాజాను ఆయన కార్యాలయంలో స్థానిక నేతలతో కలసి పలు విషయలపై చర్చించారు. గత కొద్ది రోజులు క్రితం ఈఎస్ఐ చర్చి పక్కన ఉన్న బీరప్ప గుడిని భెల్ అధికారులు తొలగించారని అలాగే ఏళ్ల తరబడి అక్కడ పాడి రైతులు పశువుల కొట్టాలను వేసుకొని జీవనం సాగిస్తున్నారని వాటిని సైతం అధికారులు తొలగించి నోటీసులు ఇచ్చారని తెలిపారు. రాయసముద్రం చెరువు సమీపంలోని మసీదు నిర్మాణం భెల్ పరిధిలో ఉందని నోటీసులు ఇచ్చారని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఈడిని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, వివిధ పార్టీల నాయకులు కే.సత్యనారాయణ, యాదగిరి, ఐలేష్, గోవింద్, మల్లేష్, నరసింహ, కుమార్‌లు పాల్గొన్నారు.

వారాలు గడుస్తున్నా .. వ్యర్థాలు అలాగే..



బంజారాహిల్స్: చెట్ల కొమ్మలు కొట్టేసి రోడ్ల పక్కన వేసి 15 రోజులు గడుస్తున్నా తొలగించడం లేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని సోమాజిగూడ జాఫర్ అలీబాగ్‌లో 15 రోజుల క్రితం కురిసిన గాలి వానలకు విరిగిపడ్డ చెట్లకొమ్మలను డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది కొట్టి అక్కడే కుప్పలుగా వేశారు. అక్కడ ఇరుకైన రోడ్డు ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొలగించాలని సిబ్బందికి ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ వారు విమర్శిస్తున్నారు.

ముమ్మరంగా రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలన

ఫిలింనగర్: కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను రేషనింగ్ సర్కిల్-7 పరిధిలో అధికారులు ముమ్మరంగా వెరిఫికేషన్ చేస్తున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు కచ్చితంగా తెల్లరేషన్ కార్డు కావలసి ఉండటంతో చాలా మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అర్హులైన వారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని పక్షపాతం పాటించకుండా నిజమైన లబ్ధిదారులకు మాత్రమే న్యాయం చేయాలంటూ అధికారులకు సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ పలు బస్తీల్లో బుధవారం రేషనింగ్ సర్కిల్-7 రేషనింగ్ ఆఫీసర్ శంకర్ దరఖాస్తుదారుల నివాసాలను పరిశీలించి నివేదికలు రూపొందించారు.

జెప్టో డెలివరీ బాయ్స్‌పై కేసు నమోదు

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైహోమ్స్ జువెల్స్ అపార్ట్‌మెంట్‌లో గొడవకు దిగిన జెప్టో డెలివరీ బాయ్స్‌పై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి మైహోమ్స్ జువెల్స్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన సంఘటనపై ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ జెప్టోలో పనిచేస్తూ ఆదివారం సాయంత్రం ఆర్డర్ డెలివరీ చేసేందుకు వచ్చాడు. అక్కడ సిబ్బందికి సరైన ఐడి కార్డు చూపించకపోవడంతో సాగర్‌ను అపార్ట్‌మెంట్ సిబ్బంది గేట్ వద్ద నిలిపివేశారు. దీంతో గొడవ పడ్డ సాగర్ జెప్టో వాట్సప్ గ్రూపులో ఈ విషయాన్ని పోస్ట్ చేశాడు. పలువురు డెలివరీ బాయ్స్ అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. అపార్ట్‌మెంట్ వాసులు ఎంత చెప్పినా వినకపోవడంతో మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్దిచెప్పి డెలివరీ బాయ్స్‌ను పంపించి వేశారు. దాడికి ప్రయత్నించిన సాగర్‌తో పాటు కె.అశోక్, సిహెచ్. గోవిందరాజ, సాయికుమార్, నరేందర్, డేవిడ్‌లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.